ప్రజాశక్తి
బుధవారం 28 మే 2025
5
కర్నూలు



సాగుకు సన్నద్ధం

నైరుతి ప్రభావంతో తొలకరి వర్షాలు ఈ ఏడు ముందుగానే కురవడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఖరీఫ్ విత్తు కోసం భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌కు సాగుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు..

- ఖరీఫ్ విత్తుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- పొలం పనుల్లో బిజీబిజీ



పత్తికొండ మండలం హోసూరులో వ్యవసాయ పనుల్లో రైతులు

● ఈసారి ముందుగానే..

ఏటా జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ ఆరంభం అవుతుంది. ఈ సాగు కాలం జూన్ 1 నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఉంటుంది. ఈ కాలంలోనే నైరుతి రుతుపవనాలు వస్తాయి. ఈ సారి మే చివరి వారంలోనే రుతుపవనాలు పలకరించాయి. నిరుడు ఇదే సమయానికి వర్షం పడలేదు. జూన్ 15 తర్వాత వర్షం పలకరించింది.తర్వాత అరకొర వర్షానికి ఆదరాబాదరా దుక్కులు చేసుకుని విత్తనం వేసుకున్నారు. వేరుసెనగ పంట అత్యల్పంగా సాగైంది. ఈసారి ఖరీఫ్‌కు వర్షం శుభారంభం పలికింది. మే నెలల్లోనే కొన్నిచోట్ల మంచి వర్షం పడింది.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

తొలకరి వర్షాలు కురవడంతో సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ముందు జాగ్రత్తగా వ్యవసాయ శాఖ అధికారులు కార్యచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లాలో కురిసిన వానలతో అన్నదాతలు భూములు చదును చేయడంలో నిమగ్నం అయ్యారు. ఖరీఫ్ సాగు గత ఏడాది కంటే ఈసారి ఇంకా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువులు ఏ మేరకు అవసరమవుతాయనేది అధికారులు కార్యాచరణ రూపొందించారు. పంటలసాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా వ్యవసాయాధికారులు చర్యలు ప్రారంభించారు. ఈసారి ఖరీఫ్ సాగుకు ప్రధాన పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఏ పంట విత్తనాలు ఎంత మేర అవసరమవుతాయనేది అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించింది. అందుకు సంబంధించి ఇప్పటికే అన్ని సిద్ధం చేశారు. పంటల సాగులో ఎంతో ముఖ్యమైన ఎరువులను రైతులకు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులు అధికారులు ఇచ్చే సూచనలు వాడాల్సిన కంటే ఎక్కువగా ఎరువులు వాడడంతో అదనంగా ఎరువులు తెప్పించాల్సి వస్తుందని అధికారులు అంటున్నారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సాగు 4,19,219 హెక్టార్లలో జరుగుతుంది. ఇందులో ప్రధానంగా పత్తి 2,43,689 హెక్టార్లు, వేరుశనగ 58,969, కంది 25,557, ఆముదం 9,231, మిరప 29,998, ఉల్లి 15,698, వరి 12,771, ఇతర పంటలు 23,306 హెక్టార్లలో సాగు ఉంటుంది. గత సంవత్సరం రైతులు జూన్ నెల మొదలుకొని జూలై వరకు భూమిలో అదును బట్టి విత్తనాలు నాటారు. ఈ ఏడాది నెలరోజులు ముందుగానే వర్షాలు పలకరించాయి. ఇప్పటికే ఖరీఫ్‌కు పొలాలను సిద్ధం చేసుకుని విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. రబీ సీజన్లో సాగు చేసిన పంటల మిగిలిపోయిన వ్యర్థ్యాలను ఇప్పటికే తొలగించారు. పొలాల్లో పంటల దిగుబడి కోసం పశువుల పేడను వదులు కోవడం, వాటిని చల్లుకోవడం వంటి పనులు చేస్తున్నారు. మరి కొంతమంది రైతులు ఏకంగా వ్యవసాయ పొలాల్లోనే ఆవులను ఆపుతున్నారు. గతేడాది జూన్ మొదటి వారంలో వర్షాలు పడి ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ పొలాల్లో విత్తనాలను వేశారు. ఈ ఏడాది మాత్రం మే నెల మొదటి నుండి వర్షాలు పడుతుండడంతో రైతన్నలు పలు రకాల విత్తనాల షాపుల వద్ద క్యూ కట్టి విత్తనాలు తెచ్చుకొని మరొకసారి వర్షం పడితే వేసేందుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్ పంటల సాగుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాల కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు చాలా ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



రాబోయే రోజుల్లో సమృద్ధిగా పడాలి

ఐదు ఎకరాలు లో ఆముదం పంటను సాగు చేస్తున్నాను. వర్షాలు విస్తారంగా పడడంతో పంట వేయడానికి అనువుగా ఉంది. గత ఏడాది జూన్ 15న విత్తనం నాటాం. రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా పడితే దిగుబడి ఆశించిన విధంగా వస్తుంది.

- ఆనంద్, ముక్కెళ్ల గ్రామం, తుగ్గలి మండలం.



సాగుకు సిద్ధవుతున్నాం..

ఈ సంవత్సరం తొలకరి వానలు ముందే కురవడంతో సాగుకు సిద్ధవుతున్నాం. 8 ఎకరాల్లో కంది పంట వేస్తున్నాను. ఇప్పటికే దుక్కులు అయిపోయాయి. ఇంక విత్తనాలు తెచ్చుకోవాలి. రైతులు ఆరుతడి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తెలో విత్తు నాటితే తెగుళ్లు రాకుండా పంట సమయానికి చేతికి వస్తుంది.

- లోకేష్, హాలహర్వి.

పిల్లల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి

- శిశు సంక్షేమ అధికారులను ఆదేశించిన కలెక్టర్



సిక్యాంపులోని శిశుగృహాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పిల్లల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిక్యాంపులోని శిశు గృహ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ శిశు గృహంలో ఉన్న సదుపాయాలు, పరిసరాలను పరిశీలించారు. శిశు గృహమంతా కలియ తిరిగారు. లివింగ్ రూమ్, ఫీడింగ్ రూమ్, వంట గది, టాయిలెట్లు, కంప్యూటర్ గది, ఆఫీస్ రూమ్ అన్నీ పరిశీలించారు. శిశు గృహంలో ఉన్న పిల్లలకు డైరీ మిల్క్ చాక్లెట్లు అందించారు. ఐసిడిఎస్ పీడీ నిర్మల, జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద, శిశు గృహ కేంద్రం ఇంచార్జి మేనేజర్ మెహతాజ్ బేగం, తదితరులు పాల్గొన్నారు

తూకాల్లో తేడాలు ఉండకూడదు : కలెక్టర్

- కర్నూలు ఎంఎల్ఎస్ గోడౌన్ పరిశీలన

ప్రజలకు రేషన్ సరుకులు సక్రమంగా అందేలా అన్ని దశల్లో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సివిల్ సప్లయ్స్ అధికారులను ఆదేశించారు.. తూకల్లో ఎలాంటి తేడాలూ ఉండకూడదని హెచ్చరించారు. స్థానిక చాణిక్యపురి కాలనీలోని సివిల్ సప్లయిస్ మండల స్థాయి స్టాక్ పాయింట్ గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్‌పిషాప్‌లకు సరఫరా చేసే రేషన్ సరుకుల నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడీలకు సరఫరా చేసే టేక్‌హోమ్ రేషన్‌కు సంబంధించిన కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లను పరిశీలించారు. తూకాలు వేసే యంత్రాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్స్ డిఎమ్ నాగసుధ, డిఎస్ఓ రాజా రఘువీర్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ అసిస్టెంట్ మేనేజర్ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద ఎంపికైన గిరిజన గ్రామాల అభివృద్ధికి జూన్ 15 నుంచి కషి చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. మంత్రాలయం మండలంలోని పరమాన్ దొడ్డి, నెరణికి, హోళగుంద మండలంలోని హోళగుంద, కోగిలతోట, మద్దికెర మండలం లోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంపా గ్రామాల్లో ఈ పథకం అమలు చేయాలన్నారు. జూన్ 15 నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.



చాణిక్యపురి కాలనీలోని సివిల్ సప్లయిస్ మండల స్థాయి స్టాక్ పాయింట్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

శవాలను బంధువులకు ఎందుకివ్వలేదు

- పోలీసులతో మూకుమ్మడిగా కాల్చేయడం అమానుషం - న్యాయ విచారణకు వామపపక్ష పార్టీల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్


చత్తీస్‌ఘడ్‌లో రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా మాడ్ ప్రాంతంలో భద్రతాదళాల కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబసభ్యులకు ఎందుకు అప్పగించక పోవడం దుర్మార్గమని వామపక్షాల నాయకులు కేంద్రప్రభుత్వ వైఖరిని ఖండించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న సిపిఐ మావోయిస్టు కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావు, సజ్జానాగేశ్వరరావు, రాకేష్, విజయలక్ష్మి, కర్నూలు జిల్లా ములుగుందం గ్రామానికి చెందిన లలిత తదితరుల మృతదేహాలను వారి బంధువులకు ఇవ్వకుండా పోలీసులే కాల్చివేయడం అమానుషమని, కనీస మానవీయ విలువలకు విరుద్ధమని సిపిఐ, సిపిఎం, పిఒపి, విరసం, ఎస్‌డిపిఐ ,న్యూ డెమోక్రసీ ,సిపిఐ ఎంఎల్, ఆర్‌వివి, కెవిఎస్‌పిఎస్, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు సిపిఐ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలో అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ... మావోయిస్టుల కుటుంబ సభ్యులు గత ఐదు రోజులుగా నారాయణపూర్‌లోని జిల్లా ఆసుపత్రిలో పడిగాపులు గాచినా వాళ్లకు మృతదేహాలను ఇవ్వకుండా పోలీసులే కాల్చివేయడం రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. ఈ మొత్తం ఘటన పై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ... చంపాక శవాలు కూడా నిజాలు చెపుతాయని భయపడి పోలీసులతో అంత్యక్రియలు చేయించడం బిజెపికి ఒక అలవాటుగా మారిందన్నారు. గతంలో ఉత్తర ప్రదేశ్‌లో ఒక దళిత అమ్మాయి అత్యాచారానికి గురయినప్పుడు కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆమె శవాన్ని కూడా ఇలాగే కాల్చి వేశారని పేర్కొన్నారు. భౌతికకాయాలను బంధువులకు ఇవ్వకుండా పోలీసులే కాల్చివేయడం అమానుష చర్య అని అన్నారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ శవాలకు కూడా హక్కులు ఉంటాయని, మృతులు ఏ రంగానికి చెందిన వారయినా వారి మృత దేహాలకు అంత్య క్రియలు, అంతిమ సంస్కారాలు నిర్వహించు కునే హక్కు ఆ తల్లులకు, కుటుంబీకులకు ఉంటుందని అన్నారు. మృతుల శరీరాలు ఆంధ్రప్రదేశ్‌కు ఎట్టి పరిస్థితుల్లో రాకూడదని మంత్రి అచ్చన్నాయుడు, శ్రీకాకుళం ఎస్‌పి.మహేశ్వరరెడ్డి, నంబాల కేశవరావు, కుటుంబీకులను బెదిరించారని, దీన్ని బట్టి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమే ఉద్దేశ్య పూర్వకంగానే మృతుల శరీరాలు కుటుంబం వారికి అందకుండా చేసిందని పేర్కొన్నారు. ప్రజాభ్యుదయ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మన ప్రభుత్వాలు మధ్యయుగాల పాలకులకన్నా, రష్యాలోని జార్ చక్రవర్తికన్నా దుర్మార్గంగా తయారయ్యాయని, యుద్ధ నియమాల ప్రకారం ప్రత్యర్థి శిబిరానికి చెందిన సైనికుల మతదేహాలను గౌరవించాలనే మానవీయ విలువలను చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు, కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వాలు ఉల్లంఘించాయని అన్నారు. పౌరహక్కుల సంఘం నాయకుడు అల్లా బకష్ మాట్లాడుతూ యుద్ధంలో మరణించిన వారి మృత దేహాలు సైతం శత్రుదేశాల వారికి గౌరవంగా ఇవ్వడం అంతర్జాతీయ న్యాయ సూత్రం, ఐక్యరాజ్య సమితి నిబంధన కూడా అని అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు వెంకటస్వామి, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకుడు భాస్కర్, సిపిఐ సీనియర్ నాయకుడు రామచంద్రయ్య, జిల్లా నాయకుడు గిడ్డయ్య, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రైతుకూలి సంఘం నాయకుడు సుంకన్న, ఎస్‌డిపిఐ నాయకుడు చాంద్‌బాషా పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన గౌస్‌దేశాయ్, శ్రీనివాసరావు, అల్లాబకాష్, తదితరులు

ఎండియు ఆపరేటర్లను కొనసాగించాలి

ప్రజాశక్తి-పత్తికొండ



రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాలను తొలగిస్తూ ఎండియు ఆపరేటర్లను కూడా తొలగించడం దారుణమని వారిని వెంటనే కొనసాగించాలని సిఐటియు జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండలో సిఐటియు మండల అధ్యక్షులు దస్తగిరి అధ్యక్షతన అంబేద్కర్ సర్కిల్ నుండి ఎండియు ఆపరేటర్లను, సిఐటియు నాయకులు ఆర్‌డిఒ కార్యాలయం ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ పంపిణీ అందించాలని ఎండియు వాహనాలను ఏర్పాటు చేస్తూ ఆపరేటర్లను నియమించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం జూన్ 1న పేద ప్రజలకు రేషన్ డీలర్ల ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం దుర్మార్గమని అన్నారు. ఎండియు ఆపరేటర్లకు ప్రత్యామ్నాయంగా జీవనోపాధి కల్పించిన తర్వాత రేషన్ డీలర్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎండియు ఆపరేటర్ల పై ఆలోచించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు సిఐటియు నాయకులు, ఎండియు ఆపరేటర్లు కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండియు ఆపరేటర్లు రామ్మోహన్ రెడ్డి, మధుబాబు, హామీదు, బాలరాజు, నరసింహులు, కాశి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి శ్రమదానం

ప్రజాశక్తి-సి బెళగల్ : సిబెళగల్ మండల కేంద్రంలో గుంతల మయంగా మారిన ఆర్అండ్ బి రోడ్డుకు టిడిపి నాయకుడు ధనుంజయ మంగళవారం శ్రమదానం చేశారు. సొంత ఖర్చులు వెచ్చించి తహసీల్దార్ కార్యాలయం ముందు రోడ్డుకు ఏర్పడిన పెద్ద గుంతను ఎర్రమట్టితో పూడ్చివేశారు. జేసీబీతో రోడ్డు చదును చేయించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా వర్షపు నీరు కాల్వల్లోకి వెళ్లేలా చేపట్టడంతో నాయకుడి ఔన్నత్యం చాటుకున్నారు.



నెహ్రూకు కాంగ్రెస్ నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాన మంత్రి జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నివాళు లర్పించారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానిబాషా, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, ఒబిసి జిల్లా చైర్మన్ డివి.సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల 'యోగ' క్షేమాలు పట్టవా..?

-యోగాంధ్ర ఆర్భాటానికే ప్రాధాన్యత
-పనులను వదిలేసి వెళుతున్న ఉద్యోగులు
-ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జూన్ 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటున్న నరేంద్ర మోడీ కార్యక్రమానికి ముందస్తుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నెలరోజులపాటు ఆర్భాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అసలు విధులను నిర్వర్తించకుండా ఉద్యోగులు, అధికారులు ఈకార్యక్రమంలోనే పాల్గొంట న్నారు. కార్యాలయాలకు పనుల నిమిత్తం వెళ్లిన ప్రజలకు అధికారులు, సిబ్బంది అంద ుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఈనెల 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయంలోని ఉద్యోగ ఉద్యోగుల నుండి జిల్లా స్థాయిలో పనిచేసే అధికారి వరకు భాగస్వామ్యం చేసేలా చర్యలు చేపట్టింది. నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రభుత్వం ఊదురగొట్టు ప్రచారం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులకు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అవగాహన కార్యక్రమాలు ర్యాలీలు వంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ నుండి మొదలుకొని గ్రామస్థాయిలో పనిచేస్తున్నటువంటి సచివాలయ సిబ్బంది రోజువారిగా ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

నెల రోజులపాటు ఆర్భాటపు కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వం ప్రచారం నిర్వహించడంతోపాటు ఉద్యోగులందరినీ భాగస్వామ్యం అయ్యేలా చేయడం పట్ల ప్రజలు విసిగెత్తుతున్నారు. మండల గ్రామస్థాయిలో అధికారులు సిబ్బంది కార్యాలయంలో లేకుండా ఈ కార్యక్రమంలోనే గత ఆరు రోజులుగా పాల్గొంటున్నారు. కార్యాలయాల్లో అసలైన పనులను వదిలేసి ఇప్పుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నడంతో ప్రజలు తమ పనుల నిమిత్తం వచ్చినవారికి సిబ్బంది, అధికారులు కనిపించక పోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పంటలు సాగు చేసుకునేందుకు బ్యాంకు నుండి రుణాలను పొందెందుకు అడంగల్ కాపీలను సమర్పించాల్సి ఉంటుంది. అడంగల్ పత్రాలను పొందేందుకు సచివాలయాలకు వెళ్తే సిబ్బంది లేకపోవడంతో రైతులు వెను తిరిగి వెళ్ళిపోతున్నారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుకు చేసుకునేందుకు సచివాలయాలకు వెళ్తున్నటువంటి ప్రజలకు అక్కడ సిబ్బంది కోసం గంటలకొద్దీ వేచి చూసి పడిగాపులు కాస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటాలను మానుకొని ప్రజలకు అవసరమైన సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు. ప్రచార ఆర్భాటానికి ప్రాధాన్యత ఇస్తే ప్రజల యోగక్షేమాలను ఎవరు చూడాలని ప్రశ్నిస్తున్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం పదిలం : కమిషనర్

-నగరంలో మాస్ ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



యోగా సాధన ద్వారా ఆరోగ్యం బాగుంటుందని కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా కర్నూలు అవుట్ డోర్ స్టేడియం నుండి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన మాస్ ర్యాలీని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ యోగా ను అందరికీ అందించాలి అనే బహత్తరమైనటువంటి ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి సమక్షంలో విశాఖపట్నం సముద్ర తీర ప్రాంతంలో ఐదు లక్షల మందితో ఒకే సమయంలో ఒకే వేదికపై సాధన చేస్తూ ఒక ఈవెంట్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరిని గ్రామాలు, పట్టణాలు, నగరాలు, కార్పొరేషన్లు అన్ని ప్రాంతాలలోని రెండు కోట్ల మంది రాష్ట్ర ప్రజల ను భాగస్వామ్యం చేస్తుందన్నారు. యోగ కార్యక్రమంలో భాగంగా ఒక నెల రోజులపాటు యోగ పై అవగాహన, అభ్యాస కార్యక్రమాలు చేయడానికి ప్రణాళిక ను కూడా ప్రకటించిందని,ఈనెల 21న కర్టన్ రైజర్‌తో ఈవెంట్ ను ప్రారంభించుకున్నామన్నారు. ఈ నెల రోజులపాటు ప్రతిరోజు ఏదో ఒక కార్యక్రమం ద్వారా యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మంగళవారం చిన్నారులను, పెద్దలను, వయోవృద్ధులను, ఉద్యోగులు, వ్యాపారస్తులు, తదితర అన్ని వర్గాల వారిని అందరిని భాగస్వాములు చేస్తూ ఒక మెగా ర్యాలీని చేశామన్నారు. జిల్లాలో యోగా గురువుల చేత మాస్టర్ శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ రాజా రఘువీర్, సెట్కూర్ సిఇఒ డాక్టర్ వేణుగోపాల్, డిఎస్‌డిఒ భూపతి రావు, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, రాష్ట్ర యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, ఫిషరీస్ ఏడి రంగనాథ్ బాబు, ఇతర జిల్లా అధికారులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సి బెళగల్ : దినచర్యలో భాగంగా యోగా పై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలని ఎండిపిఒ రాణెమ్మతో, తహసీల్దార్ పురుషోత్తంతో పాటు ఆయా శాఖా అధికారులు ప్రజలకు సూచించారు. యోగా శిక్షణ తరగతులలో భాగంగా సి బెళగల్ లోని భార్గవ రాయల్ స్కూల్లో యోగా శిక్షణ నిర్వహించారు. యోగా ప్రయోజనాలపై వారు అవగాహన కల్పించారు.

మద్దికేర : యోగ సాధన చేయడం వల్ల శారీరిక మానసిక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. మద్దికేర డిపిఎపి కమ్యూనిటీ హాలులో ప్రభుత్వ అధికారులు, యోగ ట్రైనర్లతో కలిసి, శిక్షణా తరగతులు నిర్వహించారు. జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి, యోగ ట్రైనర్లు రంగస్వామి, రామేశ్వర్ రెడ్డి రంగస్వామి, ఐకెపి అధికారులు, ఉపాధి హామీ, విఆర్‌ఒలు, సచివాలయం సిబ్బంది పంచాయతీ కార్మికులు తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది

జిజిహెచ్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ డే

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా వైద్యులకు, కేక్ కట్ చేసి వైద్య సిబ్బందికి హాస్పిటల్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ విభాగంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు ప్రతి రోజూ 24 గంటలు అందిస్తున్న సేవలు అమూల్యమని, ఎంతో మంది ప్రాణాలు కాపాడడంలో వారి పాత్ర ముఖ్యమని అన్నారు. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు, రోగులకు తక్షణ వైద్య సహాయం అందించడానికి వైద్యులు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అనస్తీసియా ప్రొఫెసర్, డాక్టర్ రామ్ శివ నాయక్, డాక్టర్ సుధీర్, సర్జరీ ప్రొఫెసర్, డాక్టర్ రామకృష్ణ నాయక్, ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ ఫయాజ్, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ఉపాధి పనులను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉపాధి పెండింగు బిల్లులు విడుదల చేయాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని కేతవరం గ్రామంలోని ఉపాధి పనులు చేస్తున్న నీటి కుంట పనులను ఆయన పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి పెండింగ్ బిల్లులు విడుదల చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. 8 వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ఇంతవరకు ఒక్క పైసా డబ్బులు రాలేదంటే ఉపాధి కూలీల పట్ల చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు.ఉపాధి కూలీ కుటుంబాలకు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, వెంకటస్వామి, ఉపాధి కూలీలు శేషన్న, యర్రమల, మద్దిలేటి, బాలు, మద్దమ్మ, మళ్లీ, పుల్లమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



స్టిక్కర్లను విడుదల చేస్తున్న నాయకులు

స్మార్ట్ మీటర్లు వద్దు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి- ఆలూరు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను మరిచి, ప్రజలపై అధిక విద్యుత్ చార్జీలు వేస్తూ స్మార్ట్ మీటర్లను పెడుతోందని, వాటిని వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. మంగళవారం ఆలూరులోని జ్యోతిబసు భవన్‌లో సమావేశం కెపి.నారాయణస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్‌మీటర్లు బిగించవద్దని స్టిక్కర్లను విడుదల చేశారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన చంద్రబాబు గెలిచాక స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించి పేదలపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు కలిగే నష్టాన్ని ఇంటింటికీ వెళ్లి సిపిఎం ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ పేదలకు అందని ద్రాక్షగా మారుతుందని విమర్శించారు. ప్రభుత్వం దిగివచ్చి స్మార్ట్ మీటర్లు బిగించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, ఎస్.వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, రత్నమ్మ, విఠల్, ధనుంజయ్, ప్రేమ్ రాజ్ పాల్గొన్నారు.

కల్తీకి పాల్పడితే చర్యలు

- మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సందీప్

ప్రజాశక్తి - ఆదోని


తనిఖీలు నిర్వహిస్తున్న సందీప్

హోటళ్లు, తిను బండారాల్లో కల్తీ, నాసిరకం పదార్థాలు కలిపి తయారు చేస్తే కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సందీప్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో హోటళ్లు, బేకరీలను తనిఖీ చేసి తిండి పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, బేకరీస్, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీ, స్నాక్ పాయింట్లు, ఫుడ్ కౌంటర్లు ఇతర ఆహార, నీటి ప్లాంట్లలో శుభ్రత లేదని తేలిందన్నారు. తనిఖీల్లో అస్వచ్ఛత పరిస్థితులు, ప్రజారోగ్య నిబంధనల ఉల్లంఘనలు బయట పడ్డాయని తెలిపారు. అనుమతులు లేకుండా నడుపుతున్న వ్యాపారాలు, అపరిశుభ్రమైన వంట గదులు, చీకటి గదుల్లో నిల్వ చేస్తున్న మాసిన ముడి పదార్థాలు, కీటకాలు ఉన్న ప్రదేశాల్లో ఆహార పదార్థాల ఉత్పత్తిని గమనించామని చెప్పారు. సరైన నీటి పరీక్షలు లేకుండా సరఫరా చేస్తున్న తాగునీటి వంటివి ఉన్నాయన్నారు. పర్యావరణ అనుమతులు, ఫుడ్ లైసెన్సులు, మున్సిపల్ అనుమతులు లేకుండా నడుపుతున్న వ్యాపారాలపై భారీ జరిమానాలు విధించామన్నారు. తగిన చర్యలు తీసుకొని లోపాలను సరిదిద్దాలని ఆదేశిస్తూ సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. నిర్దేశిత గడువులోపు లోపాలను సరి చేయకపోతే, సంబంధిత సంస్థలపై మున్సిపల్ యాక్ట్-1965 ప్రకారంగా కేసులు నమోదు చేసి, లైసెన్స్ రద్దు, వ్యాపారం మూసివేత వంటి తగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబేద్కర్ కాలనీగా మార్చాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ఎంఆర్‌పిఎస్ వినతి

ప్రజాశక్తి - నందవరం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందవరంలోని హరిజన వాడ కాలనీని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాలనీగా మార్చాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎంఆర్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి శాంతిరాజు ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ రికార్డు పూర్వకంగా హరిజనవాడ అని పిలుస్తారని, హరిజనవాడ పేరు తీసేసి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలనీ అని మార్చాలని కోరారు. తాము కాలనీకి వెళ్లాలన్నా, అవసరాల కోసం గ్రామంలోకి రావాలన్నా రోడ్డు దుర్భరంగా తయారయిందని తెలిపారు. గ్రామంలో నుంచి కాలనీకి చేరుకోవాలంటే రెండు బ్రిడ్జిలను దాటి వెళ్లాలని చెప్పారు. ఆ బ్రిడ్జిలను చిన్నగా నిర్మించడం వల్ల చిన్నపాటి వర్షం వచ్చినా గ్రామంలోకి రావటానికి వీలు లేని విధంగా బురద, నీరు చేరి నిల్వ ఉంటుందని తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే వీధిలోకి నీరు వచ్చి నిల్వ ఉంటోందని చెప్పారు. ఆ బ్రిడ్జిలను ఎత్తుగా నిర్మించి కాలనీ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు బుజ్జి బాబు, చిన్న పోతప్ప, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శవాల సత్యానందం, మండల కన్వీనర్ పరంపోగు సురేష్, మాల నరసింహులు, పూలచింత పరంపోగు నాగేష్ పాల్గొన్నారు.

ప్రయాణం కష్టం..!

- ప్రభుత్వాలు మారినా బాగుపడని రోడ్లు
- దశాబ్దాలు గడిచినా రోడ్లకు మోక్షమెన్నడో
- ఈ రోడ్లపై ప్రయాణం చేయలేమంటున్న ప్రజలు

ప్రజాశక్తి-కోసిగి


గుంతలు పడిన హాల్వి రోడ్డు

రోడ్లు బాగుంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది. రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరి భారీగా గుంతలు పడి కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం అంటేనే వాహనదారులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు భయ పడుతున్నారు. రోడ్లపై ప్రయాణిస్తే నిండు గర్భిణులు రోడ్లపైనే కాన్పు అవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర వాహనాలైనా ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే జంకుతున్నారు. ఈ రోడ్లకు మోక్షం ఎప్పుడు కలుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలోని హాల్వి, కంబాలదిన్నె, జాలవాడి నుంచి ఎమ్మిగనూరు వెళ్లే రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరి భారీగా గుంతలు పడి కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. రోడ్లపై వచ్చే ఉద్యోగులు ఆయా గ్రామాలకు వెళ్లాలంటే, భారంగా విధులకు హాజరై బాధతో ఇళ్లకు వెళ్తున్నారు. మరోవైపు ఎమ్మినూరు నుంచి కోసిగికి రావాలంటే మంత్రాలయం మీదుగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా ఈ రోడ్డును పట్టించుకునే నాథుడే లేడా అంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలు పడిన రోడ్లపై వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్షాకాలం వస్తే ఏది గుంతనో తెలియక నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే రాజకీయ నాయకులు ఈ రోడ్ల విషయమై హామీలు ఇస్తున్నారే తప్ప హామీని అమలు చేయడం లేదు. గత వైసిపి ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ రోడ్లు బాగు చేయాలని గతంలో ప్రజాసంఘాల నాయకులు పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఏ ఒక్క ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లు బాగుపడతాయో లేదో వేచి చూడాలి. జిల్లా అధికారులు, స్థానిక నాయకులు స్పందించి రోడ్లు బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లు బాగు చేయాలి

- రాముడు, సిఐటియు మండల కార్యదర్శి



ఎమ్మిగనూరు నుంచి కోసిగికి రావాలంటే దాదాపు 2 గంటల సమయం పడుతుంది. ఎమ్మిగనూరు నుంచి కంబాలదిన్నె వరకు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై గతంలో పలుమార్లు ధర్నాలు చేసినా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోలేదు. ఈసారైనా కూటమి ప్రభుత్వంలో రోడ్డు బాగు చేయించాలి. లేకపోతే ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తాం.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

- విజయ్ నరేష్, ఆర్‌అండ్‌బి ఎఇ, మంత్రాలయం సెక్షన్

ఎమ్మిగనూరు నుంచి కోసిగికి వెళ్లే దారిలో ఉన్న కంబాలదిన్నె నుంచి ఎమ్మిగనూరు వరకు రోడ్డు శిథిలావస్థలో ఉన్న మాట వాస్తవమే. ఈ విషయమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇంకా మంజూరు కాలేదు. కోసిగి నుంచి హాల్వి వరకు వెళ్లే దారిలో ఐదు కిలోమీటర్ల మేర రూ.2 కోట్లతో రోడ్డు మంజూరయింది. కాంట్రాక్టర్ వస్తే పనులు ప్రారంభిస్తాం.


అదుపు తప్పి బోల్తా పడిన లారీ

అదుపు తప్పి గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి పరిధిలోని ఆదోని, పత్తికొండ రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంకు దగ్గర ఇండియన్ గ్యాస్ సిలిండర్ల లారీ అదుపు తప్పి బోల్తా పడింది. మంగళవారం కడప నుంచి సిరుగుప్పకు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల లారీ తెల్లవారుజామున ఆస్పరి నుంచి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి అదుపు తప్పి బోల్తా పడింది. సిలిండర్లు చెల్లాచెదురుగా పడ్డాయి. డ్రైవర్ చిన్న గాయాలతో బయటపడ్డారు.

రైతులకు రాయితీ విత్తనాలు

- ఎఒ సురేష్‌బాబు

ప్రజాశక్తి - దేవనకొండ

తొలకరి వర్షాలు మొదలు కావడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన వేరుశనగ, కంది విత్తనాలు అందుబాటులో ఉంటాయని ఎఒ సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మండలానికి వేరుశనగ 1,675 క్వింటాళ్లు, కంది 24 క్వింటాళ్లు కేటాయించినట్లు తెలిపారు. వేరుశనగ క్వింటాం ధర రూ.9,300 కాగా సబ్సిడీ రూ.3,720 పోను రూ.5,580లు రైతు చెల్లించాలని చెప్పారు. ఈ నెల చివరి నుంచి విత్తన పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రంలో ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం తీసుకెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు.

కెజిబివిలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎస్ఒ విద్యావతి

ప్రజాశక్తి - గోనెగండ్ల


ఎస్ఒ పద్మావతి

గోనెగండ్లలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్‌లో చేరడానికి ఆసక్తి ఉన్న విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్ఒ విద్యావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. కెజిబివిలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో 40 సీట్లకు గాను 20 మంది ఇప్పటికే అడ్మిషన్లు పొందారని తెలిపారు. మిగిలిన 20 సీట్లకు ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే 6వ తరగతిలో ప్రవేశాల కోసం 40 సీట్లకు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 40 మందికి జిల్లా అధికారులు సీట్లను కేటాయించారని తెలిపారు. 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ముగిసినట్లు చెప్పారు.

'కిశోరి వికాసం' ఆట విడుపుగా ఉండాలి

- సిడిపిఒ నరసమ్మ

ప్రజాశక్తి - మంత్రాలయం


మాట్లాడుతున్న సిడిపిఒ

వేసవి సెలవుల్లో అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించే 'కిశోరి వికాసం' చిన్నారులకు ఆట విడుపుగా ఉండాలని సిడిపిఒ కె.నరసమ్మ సూచించారు. మంగళవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న నాలుగో అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికల ఉన్నత విద్య నైపుణ్యాలు, కెరియర్ మార్గదర్శకాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత తదితర సమస్యల గురించి వివరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.వీర గోవిందమ్మ, వైద్య, ఆరోగ్య శాఖ నుంచి జ్యోతి, మహిళా పోలీసు శాంతి, అంగన్వాడీ టీచర్ బివి.శ్వేత, ఆశా వర్కర్ సుజాత, కె.లలిత పాల్గొన్నారు.

గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం : సిపిఎం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ప్రజలు అనేక రోగాలకు గురవుతూ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ తెలిపారు. వెంటనే మండలవ్యాప్తంగా పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపిడిఒ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, పట్టణ కార్యదర్శి అశోక్, మండల నాయకులు యూసుఫ్ బాష మాట్లాడారు. వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో మురుగు కాలువలు, వీధులు జలమయంగా మారుతున్నాయని తెలిపారు. సరైన పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో మండలవ్యాప్తంగా, పెద్ద గ్రామాలైన దేవనకొండ, తెర్నేకల్లు, కోటకొండ, కుంకనూరులో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. వెంటనే పనులు చేపట్టి ప్రజలను వ్యాధుల బారి నుంచి కాపాడాలని కోరారు. మండలంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదని, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మురుగు కాలువల్లో తాగునీటిని సరఫరా చేసే పైపులు ఉన్నందున పైపులు లీకై మురుగునీరు తాగునీటి పైపులు గుండా వెళ్తొందని తెలిపారు. ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య పనులు, డ్రెయినేజీ మరమ్మతులు, నూతన సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని కోరారు. సిపిఎం నాయకులు నాగేంద్ర, మహేంద్ర పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మహానాడులో 'తమ్ముళ్ల' సందడి

ప్రజాశక్తి - ఆదోని

కడపలో మూడు రోజుల పాటు జరగనున్న 'మహానాడు'లో టిడిపి ఆదోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో నాయకులు తరలి వెళ్లారు. మంగళవారం మొదటి రోజు మహానాడు వేదిక వద్ద జిల్లా మంత్రి టిజి.భరత్‌తో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.


మంత్రి భరత్‌తో మీనాక్షి నాయుడు, నాయకులు

'మహానాడు'ను జయప్రదం చేద్దాం

మహానాడుకు భారీగా తరలివెళ్లి జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ కోరారు. ఆదోని నుంచి మహానాడుకు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కడపలో మంగళవారం నుంచి గురువారం వరకు మహానాడు జరగనున్నట్లు తెలిపారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, మాజీ ఎంపిపి మురళీ, జిల్లా తెలుగు యువత నాయకులు గుడిసె రామకృష్ణ, మాజీ సర్పంచి, ఎంపిటిసి మహాదేవ, నాయకులు మహాదేవ, బాబురావు, చిరంజీవి, వెంకటేష్, పురుషోత్తం, ముని, రాఘవరెడ్డి, భరత్ కుమార్, ఓంకార్, ఖాసీం, సుధాకర్, అశోక్, నాగేంద్ర, చంద్ర, విజయ్, చిట్టి, వెంకటరమణ, జగదీష్, శివవర్మ, తుకారాం, నాగరాజ్ ఉన్నారు.


కార్యకర్తలతో గుడిసె ఆది కృష్ణమ్మ

కౌతాళం : టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య ఆధ్వర్యంలో మహానాడుకు తరలి వెళ్లారు. తుంగభద్ర ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, సురేష్ నాయుడు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, చౌదరి బసవరాజు, కుమ్మాలనూర్ క్యాంప్ నాగేశ్వరరావు, కురువ సంఘం నాయకులు వీరేష్, గోవిందు, మూకన్న మహానాడులో పాల్గొన్నారు.


కౌతాళం...

నేడు ఉచిత వైద్య శిబిరం

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ శాస్త్ర ఎవిఆర్ హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పెదవి, అంగిలి చీలిక శస్త్ర చికిత్స నిమిత్తం ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. బుధవారం డిఇఐసి (జిల్లా సత్వర చికిత్స కేంద్రం), ఆదోని ప్రభుత్వాస్పత్రిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. నోరు, ముఖ, దవడ ఎముకల శస్త్ర చికిత్సల నిపుణులు డాక్టర్ ఎ.విజయ్ కుమార్ చేత పరీక్షలు చేస్తారన్నారు. పెదవి, అంగిలి చీలిక శస్త్ర చికిత్స కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత స్క్రీనింగ్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవరగట్టులో అమావాస్య పూజలు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని నెరనికి, నెరనికి తండా, కొత్తపేట కొండ గుహల్లో వెలసిన శ్రీమాల మల్లేశ్వరులకు భక్తులు వర్షాన్ని కూడా లెక్కచేయకుండా మంగళవారం అమావాస్యను ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మహేష్ స్వామి, పంపా స్వామి అభిషేకం చేసి బండారు అర్చనతోపాటు కుంకుమార్చన చేశారు. మహా మంగళహారతి ఇస్తూ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పూజలు చేస్తున్న అర్చకులు

యోగాతో ఆరోగ్యం

- డిఆర్‌డిఒ అనురాధ

ప్రజాశక్తి - దేవనకొండ

యోగాతో శారీరక, మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారని డిఆర్‌డిఒ అనురాధ, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ రమణారావు తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయంలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యోగాసనాల వల్ల మనస్సు ప్రశాంతం, ఏకాగ్రతతో ఉంటుందని తెలిపారు. యోగా చేయడం వల్ల అనారోగ్య సమస్యలను నివారించుకోవచ్చని చెప్పారు. యోగా శిక్షకులు యోగాసనాలు వేయించారు. ఎంఇఒ నిర్మల, హౌసింగ్ ఎఇ ఆదినారాయణ, వెలుగు ఎపిఎం నరసన్న పాల్గొన్నారు. **చిప్పగిరి** మండల కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణ తరగతులను యోగా శిక్షకులు ప్రారంభించిన నేపథ్యంలో ఎంపిడిఒ అల్లా బకాష్ మాట్లాడారు. యోగా అనేది నిత్య జీవితంలో ఒక భాగం కావాలని, అలా ప్రయత్నించినప్పుడే ఆరోగ్యం దృఢంగా తయారవుతుందని తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి అధికారీ, ప్రజలను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలన్నారు. యోగా దినోత్సవం నాటికి ప్రతి పంచాయతీలోనూ యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. యోగా చేయడంతో ఆరోగ్యం ఎంత పదిలంగా ఉంటుందో ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, పిఇటిలు రాజు, రమాదేవి పాల్గొన్నారు. **నందవరం** మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ పుల్లయ్య మాట్లాడారు. రోజూ క్రమం తప్పకుండా యోగా చేయాలని తెలిపారు. యోగా చేయడం వల్ల శారీరక ఒత్తిడి తగ్గి మానసికంగా ఉల్లాసం కలగడానికి, శరీరంలో ఉన్న కొన్ని రోగాలు తగ్గడానికి దోహదపడుతుందని చెప్పారు. మండలంలో యోగా శిక్షణకు 171 మందిని టిఒటిలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. టిఒటిలకు బుధవారం నుంచి నందవరం, హాలహర్వి, నాగులదిన్నె, కనకవీడు గ్రామాల్లో మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారని తెలిపారు. ఎంటిఎస్ ప్రశాంతి, ఎం.శిరోమణి, లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు యోగా శిక్షణ, పోటీలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మణిమంజరి మాట్లాడారు. యోగా క్రమశిక్షణతో కూడిన జీవన విధానమని తెలిపారు. ఇఒఆర్‌డి అనంత శయన, ఎంఇఒ-2 నీలకంఠ, ఏపీవో మహ్మద్ బాషా, ఎపిఎం హేమలత, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు. **మంత్రాలయం** ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో కలిసి యోగా శిక్షణలో ఎంపిడిఒ నూర్జహాన్ పాల్గొన్నారు. అనంతరం కలుదేవకుంట, చిలుకలడోణ గ్రామాల్లో నిర్వహించిన యోగా పోటీలను తనిఖీ చేశారు. ఎంఇఒ మోహినుద్దీన్, యోగా శిక్షకులు నరసింహులు, సూరజ్, నరసింహ రాజు, రవీంద్ర, బసవరాజు పాల్గొన్నారు.


దేవనకొండలో మాట్లాడుతున్న డిఆర్‌డిఒ అనురాధ



గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


చిప్పగిరిలో యోగా చేయిస్తున్న శిక్షకులు


నందవరంలో...

యోగాతో జీవితం ఆనందదాయకం

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యోగాతో మానవ జీవితం ఆనందదాయకమని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ శేషఫణి, సిఐ శ్రీనివాసులు, నోడల్ అధికారి డాక్టర్ స్వర్ణలత, ఎంఇఒ మధుసూదన్ పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి


జలమయమైన రోడ్లను చూపుతున్న నాయకులు

జలమయమైన రోడ్లు

- పట్టని అధికారులు : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని రోడ్లు జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని తేరుబజార్‌లో టోపయ్య గుడి దగ్గర ఇటీవల కాలంలో రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. రోడ్డు నిర్మాణం సందర్భంగా పద్మశాలి కల్యాణ మండపం ముందు ఖాళీ స్థలం ఉండడంతో వర్షపు నీరు బయటికి వెళ్లడానికి డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడం వల్ల వర్షపు నీరు నిలుస్తోందని చెప్పారు. రోడ్డు వేసే సందర్భంగా స్థానికులు ఈ సమస్యను మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని విమర్శించారు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్తే వారు కూడా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్ల పర్యవేక్షణ లేకుండా సిసి రోడ్లు, పబ్లిక్ వర్కులు జరుగుతున్నాయని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని విమర్శించారు. సిసి రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టేటప్పుడు స్థానికుల అభిప్రాయాలను తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. పద్మశాలి కల్యాణ మండపం ముందు వర్షపు నీరు చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని చెప్పారు. మున్సిపల్ కమిషనర్, ఇంజినీర్లు సమస్యను గుర్తించి వర్షపు నీరు ఆగిన చోట సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు, చంద్రయ్య కొట్టాల, పాత హరిజనవాడ, శివారు కాలనీల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిపిఎం నాయకులు రమేష్, స్థానికులు గౌస్, షఫీ, మత్స్య బాష, రాఘవేంద్ర, ఎల్లప్ప, వడ్డే నాగేంద్ర పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న వేద పండితులు

ఈరన్న స్వామికి లక్ష పుష్పార్చన

ప్రజాశక్తి - కౌతాళం

ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామికి లక్ష పుష్పార్చన పూజలు చేశారు. మంగళవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి జలాభిషేకం, పుష్ప అలంకరణ, పంచామృతాభిషేకం వంటి పూజలు నిర్వహించారు. దేవాలయ సహాయ కమిషనర్ విజయ రాజు ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన పూజలు చేశారు. వేద పండితులు మురళీ కృష్ణ శర్మ, పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

విశ్రాంత విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

మండలంలోని చెట్నిహళ్లి విశ్రాంత విఆర్ఒ వీరన్న గౌడ్ అనారోగ్యంతో బాధ పడుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి వీరన్న గౌడ్ కుటుంబాన్ని మంగళవారం ఫోన్‌లో పరామర్శించారు. వైసిపి నాయకులు వై.ప్రదీప్ రెడ్డి గ్రామానికి చేరుకుని వీరన్నగౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జీ సివి.విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి అంజినయ్య, మాజీ సర్పంచి గంగుల పార్వతమ్మ భర్త గంగుల వెంకటేష్, మాజీ సర్పంచి అల్లింగప్ప, ఎంపిటిసి రామాంజనేయులు ఉన్నారు.

ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం : విద్యుత్ ఎఇ నరసన్న

ప్రజాశక్తి - కౌతాళం



వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎఇ నరసన్న కోరారు. మంగళవారం ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నప్పుడు ప్రజలు విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంట్లో తడి చేతులతో పరికరాలు తాకరాదని తెలిపారు. వీధుల్లో ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే దూరంగా ఉండి, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.